# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 1-4-2025 | NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 | సంపుటి :31 | సంచిక:187 | పేజీలు:6 | వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

ఎదిగెడి దేశము మిగుల
కదమును ద్రొక్కించి యశ్వగతి నందింపన్
ముదమును హితమును సతతము
పదిలము చేసెడి రిజర్వు బాంకును దలతున్

(1-4-1935 రిజర్వు బాంకు స్థాపన)

-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

పండుగలు మన ఐక్యత
పరుగులకు సూచికలు
మన్ కీ బాత్ ఏదీ ఐనా
మన సంస్కృతి వీచికలు
భిన్నత్వంలో ఏకత
బిక్కు బిక్కుమనే గోడు
కారకులు ఎవరైనా
క్షంతవ్యం కాదు నేడు

-వేల్పుల నారాయణ
9440433475

## వేగంగా కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు



అమ్రాబాద్ , మార్చి 31: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఆరుగురు ఆచూకీ కోసం నిరంతరం సహాయక చర్యలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సోమవారం ఎస్ ఎల్ బి సి, టన్నెల్ లో కొనసాగుతున్న సహాయక చర్యలపై సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాద ప్రదేశంలో నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు, కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణను వేగవంతం చేసి, సహాయక చర్యలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

**సమన్వయంలో సహాయక చర్యలు**

సమీక్ష సమావేశంలో శివశంకర్ లోతేటి మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తుందని ,ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా,సింగరేణి మైన్స్ రెస్క్యూ, దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లోను 24 గంటల పాటు శ్రమిస్తున్నరని వివరించారు. సహాయక బృందాలు, నిపుణులు సమన్వయంతో పనిచేస్తూ, మైనింగ్ ప్రమాదాల్లో నిష్ణాతులైన వారి సేవలను వినియోగించుకుంటూ, వారి సలహాలు సూచనలు తీసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**సొరంగంలో మట్టిని తొలగిస్తున్న రెస్క్యూ టీమ్**

ప్రస్తుతం టన్నెల్ లో కన్వేయర్ బెల్ట్ ను 13630 మీటర్ల నుండి 13730 వరకు(వంద మీటర్లు) పునరుద్ధరిస్తున్నట్లు తద్వారా టన్నెల్ లోపల ఎస్కవేటర్ల సహాయంతో సొరంగం లోపల ఉన్న మట్టిని బయటికి తరలించడానికి పనులను కొనసాగిస్తున్నట్లు శివశంకర్ తెలిపారు. సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్య లో దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది టన్నెల్లోపల సహాయక చర్యలకు అడ్డంకిగా ఉన్న స్టీల్ను కత్తిరించి లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు వివరించారు. సొరంగంలోని ఊట నీటిని ప్రతిరోజు అత్యధిక సామర్థ్యం గల పంపుల ద్వారా బయటికి పంపించేస్తున్నట్లు తెలిపారు. సహాయక బృందాలు ప్రతినిత్యం తమకు కేటాయించిన పనిని దిగ్విజయంగా పూర్తి చేస్తూ సహాయక పనులను వేగవంతం చేస్తున్నారని కొనియాడారు. సహాయక సిబ్బంది పండుగలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొనడం అభినందనీయమని, వారి యొక్క స్ఫూర్తిని ప్రశంసించారు. మట్టి తవ్వకాలు కనుగుణంగా వెంటిలేషన్ పునరుద్ధరణ జరుగుతుందని, సహాయక సిబ్బందికి ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, ఎస్ డి ఆర్ ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి సుదర్శన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి, జె పి కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ మహిళా మావోయిస్టు మృతి

దంతేవాడ మార్చి 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఛత్తీస్‌గఢ్‌లో గత కొన్ని రోజులుగా భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. తాజాగా మరోసారి ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది యాంటీ-నక్సలైట్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో నక్సలైట్లు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి చెందింది. మృతి చెందిన మావోయిస్టు వరంగల్‌కు చెందిన రేణుక అలియాస్ చైతి అలియాస్ సరస్వతిగా గుర్తించారు. ఈమె మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలని.. దండకారణ్య స్పెషల్ జోన్‌లో కమిటీ సభ్యురాలిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆమె తలపై రూ.25లక్షలు ఉన్నట్లు వెల్లడించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భారీగా తుపాకులు, పేలుడు పదార్థాలు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## హైదరాబాద్‌లో 'వాన్‌గార్డ్' గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్



హైదరాబాద్, మార్చి 31:ప్రపంచంలోని ప్రఖ్యాత ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 'వాన్‌గార్డ్' హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. వాన్‌గార్డ్ మన దేశంలో నెలకొల్పే తొలి జీసీసీ ఇదే కావటం విశేషం. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో వాన్‌గార్డ్ ప్రతినిధి బృందం నేడు సమావేశమైంది. ఈ సందర్భంగా జరిగిన చర్చల అనంతరం హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ ప్రకటించింది.

ఈ సంస్థ సీఈఓ సలీం రాంజీ , ఐటీ డివిజన్ సీఐఓ, ఎండీ నితిన్ టాండన్ , చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ జాన్ కౌచర్ , జీసీసీ, వాన్‌గార్డ్ ఇండియా హెడ్ వెంకటేష్ నటరాజన్ నేతృత్వంలో కంపెనీ ప్రతినిధి బృందం ఈ చర్చల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో ఉన్నారు.

ఈ ఏడాది చివరి నాటికి హైదరాబాద్‌లో జీసీసీ కార్యాలయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు వాన్‌గార్డ్ తెలిపింది. రాబోయే 4 సంవత్సరాల్లో 2,300 మంది ఉద్యోగులను నియమించుకోవాలని లక్ష్యంగా నిర్ణయించింది. వాన్‌గార్డ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 10 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులతో నిర్వహిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 50 మిలియన్లకు పైగా పెట్టుబడిదారులకు సేవలు అందిస్తోంది.

హైదరాబాద్ లో వాన్‌గార్డ్ ఏర్పాటు చేసే కేంద్రం ఇన్నోవేషన్ హబ్‌గా పనిచేయనుంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), డేటా అనలిటిక్స్, మొబైల్ ఇంజనీరింగ్ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో అందుకు అవసరమైన ఇంజనీర్లను తక్షణమే నియమించుకోవాలని ప్రణాళికను సిద్ధం చేస్తోంది. హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటుకు వాన్‌గార్డ్ ముందుకు రావటం సంతోషకరమైన పరిణామంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జీసీసీ గమ్య స్థానంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. వాన్‌గార్డ్ రాకతో ప్రపంచ స్థాయిలో హైదరాబాద్ మరింత బలపడుతుందని అన్నారు. మన దేశంలోని ప్రతిభను ఉపయోగించుకోవడానికి, సాంకేతిక నిపుణులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందని వివరించారు.

జీసీసీ నెలకొల్పడానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తుందని కంపెనీ ప్రతినిధులకు ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వైవిధ్యమైన ప్రతిభతో పాటు, జీవన నాణ్యత, సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు హైదరాబాద్ అనుకూలమైన వాతావరణం కలిగి ఉందని కంపెనీ సీఈవో సలీం రాంజీ అభిప్రాయపడ్డారు. వీటికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో హైదరాబాద్‌ను తమకు అనువైన చోటుగా ఎంచుకున్నామని తెలిపారు. తమ వినియోగదారులకు ప్రపంచస్థాయి సేవలను అందించటంతో పాటు ఏఐ, మొబైల్, క్లౌడ్ టెక్నాలజీలో ప్రతిభావంతులైన ఇంజనీర్లను అవకాశాలు కల్పించటం తమకు సంతోషంగా ఉందన్నారు.

## సన్ రైజర్స్‌కు హెచ్ సిఎ వేధింపులు.. విచారణకు రేవంత్ ఆదేశం

హైదరాబాద్, మార్చి 31:హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ , సన్ రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం మధ్య నెలకొన్న వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఎస్ ఆర్ హెచ్ యాజమాన్యాన్ని వేధింపులకు గురిచేసిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పై సీరియస్ అయ్యారు. ఈ అంశంపై ఇప్పటికే వివరాలు సేకరించిన సీఎం . దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ డిజి కొత్తకోటను ప్రభుత్వం కోరింది. దర్యాప్తు తర్వాత కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని మండిపడ్డారు.

ఇదిలా ఉండగా.. 'పన్నెండేళ్లుగా హెచ్‌సీఏ తో కలిసి పనిచేస్తున్నాం.. కానీ, గత రెండు సీజన్ల నుంచి తమకు చాలా వేధింపులు ఎదురవుతున్నాయి. ఒప్పందం ప్రకారం ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ జరిగే సమయంలో హెచ్‌సీఏకు 10శాతం (3900) కాంప్లిమెంటరీ టికెట్లు కేటాయిస్తున్నాం.. 50సీట్ల సామర్థ్యం ఉన్న ఎఫ్12ఏ కార్పొరేట్ బాక్స్ టికెట్లు కూడా ఇస్తున్నాం. కానీ, ఈ ఏడాది దాని సామర్థ్యం 30 మాత్రమే అని పేర్కొంటూ, అదనంగా మరో బాక్స్‌లో 20 టికెట్లు కేటాయించాలని అడిగారు. దీనిపై తర్వాత మాట్లాడుకుందామని చెప్పినా వినడం లేదు. టికెట్లు ఇస్తేగానీ బాక్స్‌లు తెరవమంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఈ వేధింపులు భరించడం మా వల్ల కాదు.. హైదరాబాద్ నుంచి వెళ్లిపోతాం' అంటూ ఇటీవల సన్ రైజర్స్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్ లేఖ విడుదల చేశారు. తాజాగా దీనిపై సీఎం రేవంత్ స్పందిస్తూ విచారణకు ఆదేశించారు.

## తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు..

హైదరాబాద్, మార్చి 31: తెలంగాణలో రాగల నాలుగు రోజుల పాటు పలుచోట్ల పలుచోట్ల వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ద్రోణి ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. రేపటి నుంచి వచ్చే నాలుగు రోజులు క్రమంగా రెండు నుంచి నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం నాడు నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడకు ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది.

బుధవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని.. వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగళ్లు కురుస్తాయని హెచ్చరించింది.

**ఆరెంజ్ అలర్ట్ ..**

నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నల్గొండ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

గురువారం వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగళ్లు పడే ఛాన్స్ ఉందంటూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది.

## మతసామరస్యానికి ప్రతీక నల్లగొండ.. మంత్రి కోమటిరెడ్డి

### -లతీఫ్ సాబ్ దర్గాకు రూ.100 కోట్లతో ఘాట్ రోడ్డు

### -రంజాన్ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ, మార్చి 31: నల్గొండ జిల్లా మతసామరస్యానికి పెట్టింది పేరని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గాలో పవిత్ర రంజాన్ ప్రార్థనలు జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ముస్లిం ప్రజలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధికి ఎంతోమంది ముస్లింలు కృషి చేశారని, అందులో అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా, సైంటిస్ట్ గా చేసిన సేవలు మరువలేనివన్నారు. హిందూ, ముస్లింలు అందరూ కలిసి నల్గొండ పట్టణాన్ని అభివృద్ధి చేసుకొనేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

**దర్గాలు, ఈద్గాల అభివృద్ధికి 25 ఏళ్లుగా కృషి**

నల్గొండ పట్టణంలోని దర్గాలు, ఈద్గాల అభివృద్ధికి తాను గత 25సంవత్సరాల నుండి కృషి చేస్తున్నానని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఇక్కడి ఈద్గా తెలంగాణలోనే అతిపెద్ద ఈద్గా అన్నారు. ఇటీవల నల్గొండలో నిర్వహించిన ఇస్తేమాలో సుమారు 40, 50వేల మంది పాల్గొన్నా ఎలాంటి సమస్య లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా లతీఫ్ సాబ్ దర్గాకు ప్రతి సంవత్సరం నిర్వహించే ఉర్సు, ఇతర ఉత్సవాల సందర్భంగా లక్షల మంది వస్తారని, పెద్దవారు, ముసలివారు గుట్ట ఎక్కలేరని, దీన్ని దృష్టిలో ఉంచుకొని లతీఫ్ సాబ్ దర్గాకు 100 కోట్ల రూపాయలతో ఘాట్ రోడ్ నిర్మిస్తున్నామని తెలిపారు.

టెండర్లు పూర్తయ్యాయని, త్వంలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. లతీఫ్ షాప్ గుట్ట నుండి బ్రహ్మంగారి గుట్ట వరకు రోప్ వే నిర్మిస్తున్నామని, బ్రహ్మంగారి గుట్టకు కూడా వేరే ఘాట్ రోడ్ వేయిస్తున్నామని, రూ.500 కోట్లతో కొత్త బైపాస్ రోడ్ టెండర్లు వేయడం జరిగిందని, వారం రోజుల్లో పనులు మొదలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, అదనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## అల్లా దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : మంత్రి జూపల్లి

మహబూబ్‌నగర్, మార్చి 31: ముస్లిం సోదరులకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కొల్లాపూర్‌లోని ఖాదర్ పాషా ఈద్గాలో రంజాన్ సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది, అల్లా దయతో ప్రజాలంతా సుఖసంతోషాలతో ఉండాలని అకాంక్షించారు. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, అల్లా బోధనలు సమాజానికి ఆదర్శమన్నారు. సమాజానికి ఉపయోగడే అల్లా బోధనలను ప్రతీ ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల పండుగలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని, తెలంగాణ రాష్ట్రంలో సర్వమత సామరస్యంతో ఉందన్నారు.

## ప్రధాని మోదీ ప్రైవేట్ సెక్రటరీగా యంగ్ ఐఎఫ్ఎస్ అధికారిణి.. ఎవరీ నిధి తివారీ

న్యూఢిల్లీ, మార్చి 31: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రైవేట్ సెక్రటరీగా యంగ్ ఐఎఫ్ఎస్ అధికారిణి నిధి తివారీ ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ నిధి నియామకాన్ని ఆమోదించింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ) అధికారి కంగా ప్రకటించింది.నిధి తివారీ 2014 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారిణి. ఆమె ది వారణాసిలోని మెహ్మూర్‌గంజ్. సివిల్ సర్వీసెస్ పరీక్షలో 96వ ర్యాంకు తెచ్చుకున్న ఆమె ఇప్పటివరకూ పలు హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంలో)లో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. 2022 నవంబర్‌లో ఆమె పీఎంవోలో అండర్ సెక్రటరీగా చేరారు. జనవరి 6, 2023 నుంచి ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

2013లో సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి ముందు, ఆమె వారణాసిలోని అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఉద్యోగం చేస్తూనే సివిల్ పరీక్షకు సిద్ధమైన నిధి తివారీ.. ఎట్టకేలకు ర్యాంకు సాధించారు. ఇక పీఎంవోలో చేరడానికి ముందు నిధి తివారీ విదేశాంగ మంత్రిత్వశాఖలో పని చేశారు. నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల విభాగంలో అండర్ సెక్రటరీగా నిధి తివారీ సేవలు అందించారు. ఇక ఇప్పటి వరకూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇద్దరు ప్రైవేట్ సెక్రటరీలు వివేక్ కుమార్, హార్దిక్ సతీశ్చంద్ర షా ఉన్నారు. ఇప్పుడు మూడో ప్రైవేట్ సెక్రటరీగా నిధి తివారీ నియమితులయ్యారు.

## ఆంధ్రప్రదేశ్ బయోటెక్నాలజీ ప్రోత్సాహానికి కేంద్రం పూర్తి మద్దతు ఇవ్వనుంది: డాక్టర్ జితేంద్ర సింగ్

హైదరాబాద్, మార్చి 31:ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మంత్రి వై. సత్య కుమార్, బయోటెక్నాలజీ రంగంలో మరింత సహకారం కోరుతూ దేశ రాజధానిలో కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌ను కలిశారు.

వారి చర్చ సందర్భంగా, ఇద్దరు నాయకులు రాష్ట్రంలో బయోటెక్నాలజీ సంబంధిత ప్రాజెక్టులను మెరుగుపరచడానికి మరియు కేంద్ర మద్దతుతో కొనసాగుతున్న కార్యక్రమాలను మెరుగుపరచడానికి మార్గాలను అన్వేషించారు.

మోడీ ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆరోగ్య సంరక్షణ మరియు పారిశ్రామిక అనువర్తనాల కోసం బయోటెక్నాలజీని ఉపయోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ నిబద్ధతను సత్య కుమార్ నొక్కిచెప్పారు. రాష్ట్రానికి అత్యాధునిక ఆవిష్కరణలను తీసుకురావడానికి సహకారం పెంచాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.

ప్రస్తుత ప్రభుత్వంలో బయోటెక్నాలజీ ప్రాధాన్యతా రంగంగా ఉందని పునరుద్ఘాటిస్తూ, డాక్టర్ జితేంద్ర సింగ్ కేంద్రం నుండి పూర్తి మద్దతును హామీ ఇచ్చారు. ఆరోగ్య సంరక్షణ, ఔషధాలు మరియు స్థిరమైన స్టార్టప్‌ల వంటి రంగాలలో బయోటెక్నాలజీ యొక్క పరివర్తన సామర్థ్యాన్ని ఆయన నొక్కిచెప్పారు, అటువంటి పురోగతులను నడిపించడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించగలదని పేర్కొన్నారు.

డాక్టర్ జితేంద్ర సింగ్, సంవత్సరాలుగా, భారతదేశంలోని బయోటెక్నాలజీ రంగంలో, బయోఫార్మాస్యూటికల్ పరిశోధన, సముద్ర బయోటెక్నాలజీ మరియు వ్యవసాయ బయోటెక్ సొల్యూషన్స్ వంటి రంగాలలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకతను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించిన అనేక బయోటెక్ ఇంక్యుబేటర్లు మరియు పరిశోధనా సంస్థలకు రాష్ట్రం ఆతిథ్యం ఇస్తోంది. బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (ఃఎఖీంఅ) నిధులు మరియు జాతీయ బయోటెక్ మిషన్ల వంటి కార్యక్రమాలతో, ఆంధ్రప్రదేశ్ బయోటెక్ స్టార్టప్‌లు మరియు పరిశ్రమ భాగస్వామ్యాలలో గణనీయమైన వృద్ధిని సాధించిందని మంత్రి అన్నారు.

## గ్రూప్స్-1లో జక్కుల అరుణ్ కుమార్ కు ర్యాంకుల పంట

### గ్రూప్-1లో స్టేట్ లో 114, మల్టీ జోన్ 1లో 64వ ర్యాంక్

హైదరాబాద్, మార్చి 31: పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాన్నాయిపేట గ్రామానికి చెందిన జక్కుల అరుణ్ కుమార్ ర్యాంకుల పరంపర కొనసాగిస్తున్నాడు. తాజాగా గ్రూప్-1లో అరుణ్ కుమార్ రాష్ట్రస్థాయిలో 114వ, మల్టీ జోన్-1 స్థాయిలో 64వ ర్యాంక్ ను సాధించాడు.

2018లో ట్రిపుల్ ఐటీ జబర్ పూర్ లో బీ టెక్(సీఈసీ) పూర్తి చేశాడు. అప్పటినుంచి హైదరాబాద్, ఢిల్లీ లో ఉంటూ సివిల్స్ కు ప్రిపేర్ మూడుసార్లు సివిల్స్ కు అటెంప్ట్ చేశాడు. 2022లో గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో అప్పటినుంచి సాధన మొదలు పెట్టాడు. గ్రూప్-2 లో రాష్ట్రస్థాయిలో 35వ ర్యాంక్, గ్రూప్-3 లో రాష్ట్రస్థాయిలో 81వ ర్యాంక్ సాధించాడు.

అరుణ్ కుమార్ తండ్రి లక్ష్మీనారాయణ కమాన్పూర్ మండల కేంద్రం లోని ఎంపీపీఎస్ లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తుండగా, తల్లి మల్లేశ్వరి మంథని మండలం వట్టపల్లిలో అంగన్ వాడీ టీచర్ గా పని చేస్తున్నారు. అరుణ్ కుమార్ గ్రూప్స్ లో సత్తా చాటడం పట్ల తల్లిదండ్రులు బంధువులు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.


శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ - శ్రీ త్యాగరాయ గానసభ,

ఆహ్వానం

శ్రీ విశ్వావసు 'ఉగాది' ప్రతిభా పురస్కారాల ప్రదానం

తేది : 02-04-2025 బుధవారం సా॥ 5-40 గం॥లకు
వేదిక : గుండవరపు హన్మంతరావు కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాద్

ముఖ్య అతిథి : శ్రీ పి.వి.చందన్‌రావు, తెలుగు యూనివర్శిటీ కీర్తి పురస్కార గ్రహీత, నిజామాబాద
సభాధ్యక్షులు : శ్రీ బండారుపల్లి రామచంద్రరావు, అధ్యక్షులు, శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్, హైదరాబాదు
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్ధనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ

ఉగాది పురస్కార గ్రహీతలు :
శ్రీ ఎన్.ఆర్.ఎస్.ఎల్.ఎన్.మూర్తి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ఛైర్మన్, హనుమాన్ ప్రోపర్టీస్, హైదరాబాదు
డా॥ కె. సాంబమూర్తి, ప్రముఖ రచయిత, న్యాయవాది
శ్రీ బల్వీర్, ప్రముఖ శిల్పి
శ్రీమతి శ్రీలక్ష్మి, ప్రముఖ రచయిత్రి
శ్రీ రాజేంద్రకుమార్, ప్రముఖ చిత్రకారుడు
శ్రీ నవకాంత్ కరిడె, ప్రముఖ తెలుగు కాలిగ్రఫీ ఆర్టిస్ట్
డా॥ ఐశ్వర్య పాతపాటి, మిస్ వరల్డ్
డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి, తెలుగు విశ్రాంత సహాయ ఆచార్యులు
లయన్ డా॥ మేడిశెట్టి వెంకటేశ్వర్లు, ప్రముఖ రచయిత, సామాజిక వేత్త

శ్రీమతి కళా శారద, కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ
డా॥ లలిత వాణి, ఉపాధ్యక్షులు, మానస
రఘుశ్రీ, కార్యదర్శి, మానస

# సరదాల విందు కావాలి ఆల్ ఫూల్స్ డే !

## (01 ఏప్రిల్ "ఏప్రిల్ ఫూల్స్ డే" సందర్భంగా)

"తాజా సమాచారం ప్రకారం, అమెరికా అధ్యక్షుడు తాను ఇటీవల తీసుకున్న నిర్ణయాలన్నింటినీ వెనక్కి తీసుకున్నారనే వార్త ప్రపంచ మానవాళిని ఆనంద డోళికల్లో ముంచేస్తున్నది. అదే విధంగా ప్రపంచ ప్రజలు స్మార్ట్‌ఫోన్‌పై విరక్తి చెంది నేటి నుంచి వాడడం మానేశారనే వార్త కూడా సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది". ఈ వార్తలను మీరు నమ్మడం లేదు కదా ! మీరు నమ్మినట్లైతే మీరు పప్పులో కాలేయినట్లే, ఏప్రిల్ ఫూల్ అయినట్లే. నేటి డిజిటల్ మార్కెట్‌లో వినియోగదారుడు నిత్యం ఫూల్ అవుతూనే ఉన్నాడు. ఒకటి కొంటే వంద ఉచితం అంటూ ఊదరగొట్టడం, అందమైన అబద్ధాల ప్రకటనలతో మోసాలు చేయడం, మా రుద్రాక్షలు కొంటే మీకు అదృష్ట దేవత అంటువ్యాధి వలె సోకుతుందంటూ పలు విధాలుగా మనం వినియోగదారులుగా నిత్యం సత్యంగా ఫూల్ అవుతూనే ఉన్నాం.

### చిలిపి సరదాల నెలవు ఆల్ ఫూల్స్ డే :

అనాదిగా ప్రపంచ దేశాలు 01 ఏప్రిల్ రోజున "ఏప్రిల్ ఫూల్స్ డే" లేదా "ఆల్ ఫూల్స్ డే" నిర్వహించుకోవడం చూస్తేనే ఉన్నాం. ఆత్మీయులను సరదాగా ఆట పట్టించడం, క్షణ కాలం పాటు అబద్ధాలతో సహచరులు లేదా బంధువులను ఆశ్చర్యచకితులను లేదా ఫూల్ చేయడం, లేని దానిని ఉన్నట్లు లేదా ఉన్న దానిని లేనట్లుగా భ్రమింపజేయడం, జోక్స్ వేసుకొని నవ్వుకోవడం, చిలిపిగా ఒకరినొకరు మోసం చేసుకోవడం, అబద్ధపు వార్తలను సామాజిక మాద్యమాల్లో పోస్ట్ చేయడం లాంటి పలు ప్రవర్తనలతో ఏప్రిల్ ఫూల్ అంటూ సంతోషంగా గడపడం "ఆల్ ఫూల్స్ డే"కు మాత్రమే సొంతం.

### ఏప్రిల్ ఫూల్ దినం చారిత్రక నేపథ్యం:

చారిత్రక నేపథ్యాలను తవ్వి చూస్తే ఏప్రిల్ ఫూల్స్ డే జననం 1582కు చెందుతుంది. ఫ్రాన్స్‌లో 01 ఏప్రిల్ రోజున ప్రారంభం అయ్యే జూలియన్ క్యాలెండర్ నుంచి 01 జనవరిన ప్రారంభమయ్యే గ్రిగోరియన్ క్యాలండర్‌కు మారిన సందర్భంలో ప్రజల కొంత అసౌకర్యానికి లోనుకావడం, ఈ మార్పును అర్థం చేసుకోలేదని వారిని ఏప్రిల్ ఫూల్‌గా గేలి చేయడం ఆచారంగా మారి, కాల క్రమంలో అన్ని దేశాలకు విస్తరించడంతో ఏప్రిల్ ఫూల్ డే బహుళ ప్రచారంలోకి వచ్చింది. మరో వివరణ ప్రకారం హిలారీ అనే పురాతన రోమ్ పండుగలో రుతువులు మారుతూ వాతావరణ మార్పులు అసంబద్ధంగా ఉండడంతో ఏప్రిల్ ఫూల్ అంటూ ఒకరినొకరు ఆట పట్టించుకోవడం జరిగేదని కూడా తెలుపబడింది. బైబిల్ ఆచారం ప్రకారం 'నోహ్' అనే పాత్ర తొలి ఏప్రిల్ ఫూల్ అయ్యాడని తెలుపుతున్నది. వ్యాపార సామ్రాజ్యాలు, క్రీడలు, రెస్టారెంట్లు లాంటి అనేక స్థలాల్లో కూడా 01 ఏప్రిల్ రోజున ఆల్ ఫూల్స్ డేను సరదాగా ప్రదర్శించడం జరుగుతూ వస్తున్నది.

హానికరం కాని, మరొకరి మనసు నొప్పించని జోక్స్, అవమానకరం కాని అవాస్తవ సమాచారాలు, ఆట పట్టించే సందర్భాలతో కొనసాగుతున్న ఆల్ ఫూల్స్ డే ప్రపంచ మానవాళిని సంతోష సాగరంలో ముంచేయడంతో పాటు మానసిక సాంత్వన చేకూర్చడం జరుగుతున్నది. నేటి ఏప్రిల్ ఫూల్ డే సరదాగా గడపాలని, మన వల్ల మరొకరి మనసు నొచ్చుకోకూడదని అర్థం చేసుకుంటూ ఆనందంగా ఆల్ ఫూల్స్ డేను జరుపుకుందాం. దైనందిన వేగవంతమైన జీవన విధానం లోంచి కొంత సమయాన్ని కేటాయించి ఏప్రిల్ ఫూల్ అంటూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుంటూ ఈ రోజైనా ఉల్లాసంగా గడుపుదాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

## -నేరానికి వినియోగించిన స్కూటీ, రెండు సెల్ ఫోన్ లు స్వాధీనం.

## -వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.




సంగారెడ్డి మార్చి 31(నేటి నిజం ప్రతినిధి )సోమవారము నాడు సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ నందు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ బాధితురాలు వెల్లడించిన ప్రకారం ఈ నెల 24 నాడు సొంత పనిమీద సంగారెడ్డి పట్టణానికి వచ్చి అనంతరం తిరిగి 25 న వారి ఆటోలో ఇంటికి వెళ్లుతుండగా సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల మామిడిపల్లి చౌరస్తా వద్ద ఫిర్యాది భర్త మూత్ర విసర్జనకై ఆటోను ఆపగా, అదే సమయంలో తెలుపు రంగు గల స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు, ఫిర్యాది భర్తను కొట్టి, బాదితురాలిని స్కూటీపై నాందేడ్ హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు గుండా నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకొని వెళ్ళి, ఇద్దరు వ్యక్తులు ఆమెపై బలవంతంగా అత్యాచారం చేశారని బాధితురాలు ఆరోపించగా సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ లో సెక్షన్. 351(2), 118(1), 70(1), 309(2) బిఎన్ఎస్, (506,324, 376-డి, 390 ఐపిసి) ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 30న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారి చగా నేరస్థులు నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు , నేరానికి వినియోగించిన స్కూటీ, 2-సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని, రిమాండుకు తరలించడం జరుగుతుందని ఎస్పీ వివరించారు.

సంగారెడ్డి జిల్లా ప్రజలకు విజ్ఞప్తి మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో మీ చుట్టూ ఎవరైయన అనుమానస్పదంగా కనిపించిన వెంటనే 100 డైల్ చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# భూకంప విషాదం నేపథ్యంలో మయన్మార్ సీనియర్ జనరల్ గౌరవనీయ మిన్ ఆంగ్ హ్లైయింగ్‌తో మాట్లాడిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 31:భూకంప విషాదం నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు మయన్మార్ సీనియర్ జనరల్ గౌరవనీయ మిన్ ఆంగ్ హ్లైయింగ్‌తో మాట్లాడారు. ఈ క్లిష్ట సమయంలో మయన్మార్‌కు అండగా నిలవడంలో సన్నిహిత మిత్రదేశంగా, పొరుగుదేశంగా భారత్ నిబద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఈ విపత్తుకు ప్రతిస్పందనగా భారత ప్రభుత్వం ఆపరేషన్ బ్రహ్మను ప్రారంభించినట్లు తెలిపిన ప్రధానమంత్రి.. బాధిత ప్రాంతాలకు తక్షణ ఉపశమనాన్ని, అవసరమైన సాయాన్ని అందించనున్నట్లు ప్రకటించారు.

"మయన్మార్ సీనియర్ జనరల్ గౌరవనీయ మిన్ ఆంగ్ హ్లైయింగ్‌తో మాట్లాడాను. విధ్వంసకరమైన భూకంపం కారణంగా జరిగిన ప్రాణనష్టం పట్ల మన ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. సన్నిహిత మిత్రదేశంగా, పొరుగు దేశంగా ఈ క్లిష్ట సమయంలో యావత్ భారత్ మయన్మార్‌కు అండగా ఉంటుంది. చఆపరేషన్ బ్రహ్మలో భాగంగా విపత్తు సహాయ సామాగ్రి, మానవతా సాయం, సెర్చ్, రెస్క్యూ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు వెంటనే పంపిస్తున్నాం".

# పాప్ సంస్కృతి, సృజనాత్మకతను ప్రోత్సహించే భారత్ అతిపెద్ద కాస్ప్లే ఛాంపియన్‌షిప్ కు ఆతిథ్యమివ్వనున్న వేవ్స్-2025

న్యూఢిల్లీ, మార్చి 31:క్రియేటర్స్ స్ట్రీట్, తెలంగాణ ప్రభుత్వ ఎపికో కాన్ భాగస్వామ్యంతో, ఐసీఏ ఇండియన్ కామిక్స్ అసోసియేషన్, ఫోర్బిడెన్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంఇఎఐ), తెలంగాణ వీఎఫ్ఎక్స్ అనిమేషన్ అండ్ గేమింగ్ అసోసియేషన్ (టీవీఏజీఏ), భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వేవ్స్ కోస్ప్లే ఛాంపియన్‌షిప్‌ను సగర్వంగా ప్రకటించాయి. ఇది భారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కోస్ప్లే పోటీగా నిలవనుంది. 2025 మే 1 నుంచి 4 వరకు ముంబయిలో జరుగనున్న వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమిట్ (వేవ్స్)- 2025 లో ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ ను నిర్వహించనున్నారు. దేశంలోని అత్యంత ప్రతిభావంతులయిన కోస్ప్లేయర్లను ఈ కార్యక్రమం ఒక్కచోట చేర్చి, పాప్ సంస్కృతి ప్రపంచంలో వారి కళాత్మకత, అంకితభావం, నైపుణ్యాన్ని ఘనంగా ఆవిష్కరించనుంది.

వేవ్స్ కోస్ప్లే ఛాంపియన్‌షిప్ దేశంలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న కోస్ప్లే సముదాయాన్ని ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ స్థాయి వేదికను అందిస్తూ, పాల్గొనేవారికి తమ నైపుణ్యాన్ని, సృజనాత్మకతను, పాప్ సంస్కృతి పట్ల ఉన్న అభిరుచిని ప్రదర్శించడానికి ఇది గొప్ప అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ ఛాంపియన్‌షిప్, దేశంలో విస్తరిస్తున్న వినోద, ఏవీజీసీ - ఎక్స్ఆర్ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ) రంగాలకు అనుగుణంగా ఉంటుంది. ఇది కాస్ట్యూమ్ డిజైన్, ప్రదర్శన, పాత్ర అభినయంలో స్వీయ వ్యక్తీకరణ, కొత్తదనాన్ని ప్రోత్సహిస్తుంది.ప్రపంచ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) మొదటి సదస్సును మీడియా, వినోద రంగాలకు ఒక మైలురాయిగా భారత ప్రభుత్వం 2025 మే 1 నుంచి 4 వరకు మహారాష్ట్రలోని ముంబయిలో నిర్వహించనుంది.

మీరు పరిశ్రమ నిపుణుడు, పెట్టుబడిదారు, సృష్టికర్త లేదా ఆవిష్కర్త అయితే ఈ సదస్సు మీరు మీడియా, వినోద రంగాలకు అనుసంధానం కావడానికి, భాగస్వామ్యంతో కొత్త ఆవిష్కరణలు చేసేందుకు, అందించేందుకు అంతర్జాతీయ స్థాయి వేదికను అందిస్తుంది.

భారత యువత సృజనాత్మక శక్తిని మరింత పెంచి, కంటెంట్ క్రియేషన్, మేధో సంపత్తి సాంకేతిక నవీకరణల కేంద్రంగా దేశ స్థితిని బలపరచేందుకు వేవ్స్ సిద్ధంగా ఉంది. ప్రధానంగా దృష్టి సారించే రంగాలలో బ్రాడ్ కాస్టింగ్, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఫిల్మ్స్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, సౌండ్ అండ్ మ్యూజిక్, అడ్వర్టైజింగ్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్, జనరేటివ్ ఏఐ, ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఎక్స్ టెండెడ్ రియాలిటీ (ఎక్స్ ఆర్) ఉన్నాయి.

# విశాఖను ఒక బ్రాండ్‌గా మారుస్తాం : నారా లోకేష్

విశాఖపట్నం, మార్చి 31:విశాఖను ఆంధ్రప్రదేశ్ ఐకానిక్ క్యాపిటల్ గా మార్చుతాం.. విశాఖ రీజియన్ పెట్టుబడులకు కేంద్రంగా మారుతోందని మంత్రి నారా లోకేష్ అన్నారు. ఆర్థిక వృద్ధిలో విశాఖను దేశంలోనే ఐదవ స్థానంలో నిలపాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్న ఆయన.. విశాఖను ఒక బ్రాండ్ గా మారుస్తామన్నారు. విశాఖలో 2029లోపు 5 లక్షల ఐటీ ఉద్యోగాలను కల్పిస్తామని స్పష్టం చేశారు.

అనకాపల్లి జిల్లా పర్యటన కోసం విశాఖకు వచ్చిన ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా విశాఖ ఎప్పుడూ మమ్మల్ని ఆదరిస్తూనే ఉందన్నారు. 2019లో రాష్ట్రం అంతా ఒక విధమైన ఫలితం వస్తే.. ఇక్కడ టీడీపీ గెలిచిందన్నారు. 2024 ఎన్నికల మెజారిటీలో నాదే రికార్డు అనుకున్నా.. గాజువాక, భీమిలిలో నాకంటే ఎక్కువ మెజారిటీలు రావడం ఇక్కడ ప్రజల ఆదరణకు నిదర్శనంగా అభివర్ణించారు.

ఇక, విశాఖలో అర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రారంభం కానుంది.. టీసీఎస్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు కాబోతోందన్నారు. ఎన్టీపీసీ హైడ్రో పవర్ గేమ్ చేంజర్ కానుందన్నారు మంత్రి లోకేష్. గతంలో వెళ్ళిపోయిన లులూ గ్రూప్ మళ్ళీ ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి సిద్ధమవుతోందని వెల్లడించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌తో విశాఖ రూపు రేఖలు మారిపోనున్నాయన్నారు. అంతర్జాతీయ సదుపాయాలతో మరిన్ని స్టేడియాలను నిర్మాణం చేస్తామన్నారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తయ్యేలోపు ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలతో విశాఖ కూడా అంతర్జాతీయ నగరంగా మారుతుందని వెల్లడించారు మంత్రి నారా లోకేష్.

# రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్



కర్నూల్, మార్చి 31:నగరంలోనీ పాత ఈద్గాలో జిల్లా కలెక్టర్, ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలు చేసిన మంత్రి టీజీ భరత్. వర్షాలు బాగా కురిసి ప్రజలందరూ సంతోషంగా ఉండాలనీ ప్రార్థన.ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఉండేలా దీవించాలని అల్లాను ప్రార్థించాను అని ప్రకటించిన మంత్రి టీజీ భరత్?నిన్న ఉగాది, నేడు రంజాన్ పండుగలు రావడం హిందూ, ముస్లింలలో సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు..కర్నూలు నగరంలో అన్ని పండుగలను కుల,మతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సోదర భావంతో ప్రజలందరూ అన్ని పండుగలు జరుపుకుంటారని పేర్కొన్నారు. ముస్లింల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తారన్నారు.

# విశాఖలో నారా లోకేష్ ప్రజా దర్బార్ - వెల్లువెత్తున ఫిర్యాదులు



విశాఖపట్నం, మార్చి 31: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తన రెండో రోజు పర్యటనలో సోమవారం ఉదయం విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 60వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న సామాన్య ప్రజానీకం నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

వినతుల పరంపరంలో బాగంగా సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇతర రాష్ట్రాల మాదిరిగా రెగ్యులరైజేషన్ కాకుండా ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకాలను కేవలం డైరెక్ట్ రిక్రూట్ మెంట్ (డీఎస్సీ నోటిఫికేషన్) పద్ధతిలో మాత్రమే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయ సమాఖ్య ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

బ్రెడ్ విన్నర్ స్కీమ్ అమలు చేయండి..

సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఏపీఎస్ఆర్టీసీ నర్సీపట్నం డిపోలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ తన భర్త మరణించాడని, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు బ్రెడ్ విన్నర్ స్కీమ్ వర్తింపజేస్తామని 2013లో యూనియన్‌తో జరిగిన అగ్రిమెంట్ అమలు చేయకపోవడంతో తమ కుటుంబం రోడ్డున పడిందని విశాఖకు చెందిన కె.రమాదేవి మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌ను అమలుచేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు.

కబ్జా భూమిలో నిర్మాణాలు

విశాఖ పెందుర్తి నియోజకవర్గం వేపగుంట జెడ్ పీహెచ్ స్కూల్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గత వైసీపీ ప్రభుత్వ అండతో కబ్జా చేసి భవనాలు నిర్మించారని, సదరు స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని విశాఖకు చెందిన రేపర్తి రాజు విజ్ఞప్తి చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదని వాపోయారు.

పదవీ విరమణ చేసినా ఉద్యోగమా..

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, రెవెన్యూ డీటీగా పనిచేసి రిటైర్డ్ అయినప్పటికీ ఏఎస్ఆర్ జిల్లా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏలో పనిచేస్తూ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న టి.అప్పారావు, ఈశ్వర్ రావులను తొలగించి అర్హులను నియమించాలని పాడేరుకు చెందిన ఎన్.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

స్థలం మేం కొంటే.. వాళ్లు లాక్కున్నారు.

కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న తాము విశాఖ పెందుర్తిలోని సుజాత నగర్ టీచర్స్ లేఅవుట్ లో 150 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని, అయితే సదరు స్థలాన్ని అబిత్ రాజు అనే వ్యక్తి దౌర్జన్యం చేసి ఆక్రమించారని ఆర్.లక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుంచి తమ స్థలాన్ని కాపాడాలని విన్నవించారు.

ఇంజనీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖపట్నానికి చెందిన కె.సౌజన్య విజ్ఞప్తి చేశారు. ఆయా అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

# నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిని సందర్శించిన ప్రధాని..

న్యూఢిల్లీ, మార్చి 31:డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దార్శనికతకు కట్టుబడి ఉన్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

నాగ్‌పూర్‌లో దీక్షాభూమి సందర్శనలో ఉన్న ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు.

నాగపూర్‌లోని దీక్షాభూమిని సామాజిక న్యాయానికి, అణగారిన వర్గాల సాధికారతకు చిహ్నంగా అభివర్ణించిన ప్రధాని.. అంబేద్కర్ కలలుగన్న భారతదేశాన్ని సాకారం చేసేందుకు మరింత కష్టపడి పనిచేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# చంద్రబాబు ఆలోచనలు అద్భుతం

## ..ఆనంద్ మహీంద్రా ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ, మార్చి 31:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన ఆలోచనలు అద్భుతంగా ఉంటాయని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. అరకు కేఫ్‌లు విస్తరిస్తున్న తీరు బాగుందని పేర్కొన్నారు. పారిస్ కేఫ్‌ల్లోని ఎలక్ట్రానిక్ స్క్రీన్లపై అరకులోని గిరిజనుల జీవనశైలికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఇక్కడి కాఫీ ప్యాకేజింగ్‌ను గిరిజనుల వేషధారణ, ఇండియాలోని వైవిధ్యమైన రంగుల స్ఫూర్తితో రూపొందించినట్లు పేర్కొన్నారు. పారిస్‌లో మా రెండో అరకు కాఫీ స్టాల్ అంటూ ఒక వీడియోను షేర్ చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. పచ్చని అరకులోయ నుంచి పారిస్ నడిబొడ్డుకు మేడ్ ఇన్ ఏపీ ఉత్పత్తి చేరడం, వరల్డ్‌వైడ్‌గా తగిన గుర్తింపు లభించడం స్ఫూర్తిదాయకమని అన్నారు.

# కూటమి పాలనలో దేవుడికీ నిద్ర కరువే : రోజా

అమరావతి, మార్చి 31: కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా మరోసారి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో మనుషులకే కాదు చివరికి ఆ దేవదేవుడికి కూడా నిద్ర లేకుండా పోతోందని పేర్కొన్నారు. జగనన్న పాలనలో తిరుమలలో రోజుకు లక్ష మందికి పైగా భక్తులకు దర్శన భాగ్యం ఉండేదని, కానీ ఇప్పుడు స్వామికి నిద్ర లేకుండా చేస్తూ, భక్తుల సంఖ్యను తగ్గిస్తున్నారని విమర్శించారు.దర్శనాల సంఖ్యను 60వేల వరకు పరిమితం చేస్తూ రోజుకు 7వేల నుంచి 10వేల బ్రేక్ దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ టీటీడీని తప్పుబట్టారు. దీంతో సామాన్య భక్తులకు స్వామి దర్శనం మరింత దూరమవుతోందని రోజా ఆవేదన వ్యక్తం చేశారు. సిఫారసు లేఖలకు ప్రాధాన్యత ఇచ్చి, డబ్బు ఉన్న వారికే దర్శన అవకాశం కల్పిస్తున్నారని ఇదేనా కూటమి, పవన్ కల్యాణ్, బీజేపీ సనాతన ధర్మం ఇదేనా చంద్రబాబు గారి నమూనా ప్రక్షాళన అంటూ మండిపడ్డారు. భగవంతుడు అన్నీ గమనిస్తున్నాడు అంటూ రోజా ట్వీట్ చేశారు. 'ఏడుకొండల స్వామికి కునుకు కరవు' అంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని కూడా రోజా పంచుకున్నారు.

# హెచ్‌సియు వద్ద 400 ఎకారల భూమి తమదే: క్లారిటీ ఇచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్ మార్చి 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నగరంలోని హెచ్‌సియు వద్ద 400 ఎకారల భూమి తమదేనని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. 400 ఎకారల భూమి వివాదంపై నిరసనలు తలెత్తిన వేళ టిజిఐఐసి కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూములు లేవని స్పష్టం చేసింది. ఆ భూమి యజమాని తామేనని న్యాయస్థానంలో ప్రభుత్వం నిరూపించుకుంది. ఓ ప్రైవేటు సంస్థకు 21 ఏళ్ల క్రితం కేటాయించిన భూమిని న్యాయ పోరాటం ద్వారా దక్కించుకున్నట్లు వెల్లడించింది. వేలం, అభివృద్ధి పనులు అక్కడి రాళ్లను దెబ్బ తీయవని తెలిపింది. అభివృద్ధికి ఇచ్చిన భూమిలో చెరువు లేదని సర్వేలో ఒక్క అంగుళం భూమి కూడా హెచ్‌సియుది కాదని పేర్కొంది.

# ఆపరేషన్ బ్రహ్మ- మయన్మార్ భూకంప బాధితులకు వైద్య సహాయం

న్యూఢిల్లీ, మార్చి 31:మయన్మార్ లో 2025 మార్చి 28న సంభవించిన పెను భూకంపం కారణంగా జరిగిన తీవ్ర నష్టానికి తక్షణ స్పందనగా, భారత సైన్యం 'ఆపరేషన్ బ్రహ్మ' కింద అత్యవసర మానవతా సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాన్ని పంపిస్తోంది.

లెఫ్టినెంట్ కల్నల్ జగ్నీత్ గిల్ నేతృత్వంలో పేరొందిన శత్రుజీత్ బ్రిగేడ్ మెడికల్ రెస్పాండర్స్ కు చెందిన 118 మంది సభ్యుల బృందం అత్యవసర వైద్య పరికరాలు, ఔషధాలతో త్వరలోనే మయన్మార్‌కు బయలుదేరనుంది. ఈ వైమానిక ఏంజెల్స్ టాస్క్ ఫోర్స్- విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో ఆధునిక వైద్య, శస్త్రచికిత్స సేవలను అందించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొంది పూర్తి సన్నద్ధతతో ఉంటుంది.

ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత సైన్యం 60 పడకలతో కూడిన వైద్య చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. భూకంపంలో గాయపడిన వారికి ఇందులో అత్యవసర చికిత్స అందిస్తారు. ఈ కేంద్రం ట్రామా కేసులతో పాటు అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రాథమిక వైద్య సేవలను అందించేందుకు పూర్తి సన్నద్ధంగా ఉంటుంది. భూకంపం వల్ల తీవ్రంగా దెబ్బతిన్న స్థానిక ఆరోగ్య సేవా వ్యవస్థకు ఇది గట్టి సహాయకారిగా ఉంటుంది.

ఈ మానవతా సహాయం 'పొరుగువారికి ప్రాధాన్యం' అనే విధానం పట్ల భారత్ నిబద్ధతను, 'వసుధైక కుటుంబం' అనే భారతీయ మౌలిక సిద్ధాంతాన్ని ప్రతిబింబిస్తుంది. సంక్షోభ సమయాల్లో భారత సైన్యం మిత్రదేశాలతో భుజం భుజం కలిపి నిలబడుతూనే ఉంది. ఇది ఈ ప్రాంతంలో మొదటి ప్రతిస్పందన దేశంగా ఉండాలనే భారత్ సంకల్పాన్ని కూడా ప్రదర్శిస్తోంది.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమన్వయంతో, మయన్మార్ అధికారుల భాగస్వామ్యంతో ఈ 'ఆపరేషన్ బ్రహ్మ' ను అమలు చేస్తున్నారు.

సాహితీ కిరణం ఆహ్వానము
శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు
కవిసమ్మేళనం, ఉగాది పురస్కారాలు
కవితల,కథల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం
ముఖ్యఅతిథి : ఆచార్య కొలకలూరి ఇనాక్
పూర్వ ఉపాధ్యక్షులు- శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
సభాధ్యక్షులు : శ్రీ తూములూరి రాజేంద్రప్రసాద్
సలహాదారులు -సాహితీకిరణం
గౌరవ అతిథి : శ్రీ గుదిబండి వెంకటరెడ్డి
గౌరవ సంపాదకులు-సాహితీకిరణం
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు-నేటినిజం
విశిష్ట అతిథులు : శ్రీ విడదల సాంబశివరావు
అధ్యక్షులు-విడదలనీహారిక ఫౌండేషన్
శ్రీ వి.వి.రాఘవరెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్-శ్రీ కార్తీక డెవలపర్స్
ఆత్మీయ అతిథి : శ్రీమతి కొసరాజు సామ్రాజ్యం
కొసరాజు ఆర్ట్ & జాహ్నవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు-సాహితీకిరణం
బహుమతి కథల విశ్లేషణ : శ్రీ తంగిరాల చక్రవర్తి,
రచయిత, విమర్శకులు
కవిసమ్మేళనం & సభా నిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
సలహాదారులు-సాహితీకిరణం
తేది:05.04.2025 శనివారం ఉదయం 10.30 గంటలకు
వేదిక: సాహితీకిరణం బ్రాంచి కార్యాలయం (ఇం.నెం.107-1-331, వార్డ్ సచివాలయం ఎదురుగా) పొత్తూరు, గుంటూరు
పొత్తూరి జయలక్ష్మి
మేనేజర్ - సాహితీకిరణం
సాహితీకిరణం సంపాదకవర్గం, సిబ్బంది

# రంజాన్ మాసంలో ధానధర్మాలకు ప్రత్యేకత : మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్, మార్చి 31: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఇవాళ మెదక్ పట్టణంలోని గాంధీనగర్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో వారు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజులపాటు ఎంతో నిబద్ధతతో ఉపవాసాలు ఉండటం ద్వారా సమాజంపై ప్రేమ, గౌరవం కలుగుతాయన్నారు. ఈ మాసంలో ధానధర్మాలకు ప్రత్యేకత ఉందన్నారు. అన్ని మతాల ప్రజలు స్నేహభావంతో కలిసి ఉండాలని ఆకాంక్షించారు.

వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్‌లు మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, మాజీ కౌన్సిలర్లు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, గడ్డమీది కృషాగౌడ్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు జుబేర్, ఫాజిల్, మహమ్మద్, మధు, మోహన్, నాగేందర్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మత పెద్దలు సత్కరించారు.

# సమాజంలో సోదరభావం పెంపొందాలి : అబ్దుల్ ఖాదీర్



నల్గొండ, మార్చి 31: అల్లా ఆశీస్సులతో సమాజంలో శాంతి సామరస్యాలు, ఐక్యత, సోదర భావం పెంపొందాలని కోదాడ పెద్ద మసీదు ఇమామ్ మౌలానా అబ్దుల్ ఖాదీర్ రషాదీ అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఈద్గాలో రంజాన్ పర్వదినం సందర్భంగా సామూహిక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. రంజాన్ మాసంలో ఆచరించిన ఉపవాస దీక్షల స్ఫూర్తితో అందరూ తమ జీవితాన్ని పరిపూర్ణంగా గడపాలన్నారు. దివ్య ఖురాన్ ఆవిర్భవించిన మాసం రంజాన్ మాసం అని, రంజాన్ మాస దీవెనలు ప్రజలందరికీ కలగాలన్నారు. ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలో ఉన్న ముస్లింలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం తదితర రాజకీయ పక్షాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మహబూబ్ జానీ, ఎర్నేని బాబు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు షేక్ నయీమ్, బొలిశెట్టి కృష్ణయ్య, ముత్యాలు పాల్గొన్నారు.

# మహా కుంభమేళా 2025 స్ఫూర్తిని జరుపుకునే ఆల్ ఇండియా డ్రాయింగ్ & పెయింటింగ్ పోటీ ఫలితాలు ప్రకటించబడ్డాయి

న్యూఢిల్లీ, మార్చి 31:విశ్వాసం మరియు సంప్రదాయాల పవిత్ర సంగమం అయిన మహా కుంభమేళా, భారతదేశం యొక్క ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక వారసత్వంలో లోతుగా పాతుకుపోయిన ప్రపంచంలోనే అతిపెద్ద శాంతియుత సమావేశంగా నిలుస్తుంది. ఈ ముఖ్యమైన సంఘటన జనవరి 13 నుండి ఫిబ్రవరి 26, 2025 వరకు జరిగింది, ఇది ఆధ్యాత్మిక జ్ఞానోదయం కోసం శాశ్వత మానవ తపనను సూచిస్తుంది. లోతైన తాత్విక ప్రాముఖ్యత మరియు శక్తివంతమైన సాంస్కృతిక వ్యక్తీకరణలకు ప్రసిద్ధి చెందిన ఈ పండుగ, భక్తి, జ్ఞానం మరియు ఐక్యత యొక్క సమిష్టి వేడుక కోసం లక్షలాది మందిని ఒకచోట చేర్చింది.

ఈ పవిత్ర సంప్రదాయం యొక్క సారాంశాన్ని కళాత్మకంగా అన్వేషించడానికి యువ మనస్సులను ప్రోత్సహించడానికి, విద్యా మంత్రిత్వ శాఖ (ఓఎస్ఇ) లోని పాఠశాల విద్య మరియు అక్షరాస్యత విభాగం, దేశవ్యాప్తంగా మహా కుంభమేళా 2025 అనే ఇతివృత్తంపై అఖిల భారత డ్రాయింగ్ ఒ పెయింటింగ్ పోటీని నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు మరియు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అనుబంధ పాఠశాలల నుండి 6 నుండి 8వ తరగతి విద్యార్థుల కోసం ఈ పోటీని నిర్వహించారు. వాస్తవికత మరియు సృజనాత్మకతకు ప్రాధాన్యతనిస్తూ, భవ్య మహా కుంభ్, దివ్య మహా కుంభ్ మరియు ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అనే మూడు ఇతివృత్తాల కింద ఈ పోటీని నిర్వహించారు. వైవిధ్యంలో ఏకత్వం యొక్క స్ఫూర్తిని అభినందించడానికి మరియు జరుపుకోవడానికి, ఈ కార్యక్రమం యొక్క ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక ప్రాముఖ్యతను అలాగే భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక సంప్రదాయాలు మరియు విలువలను అర్థం చేసుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహించడం దీని లక్ష్యం. ఫలితాలు 2025 మార్చి 24న ప్రకటించబడ్డాయి.

ఈ పోటీలో పాల్గొనడం విస్తృతంగా జరిగింది, 1040 కేంద్రీయ విద్యాలయాల నుండి మొత్తం 39,840 మంది విద్యార్థులు, 404 నవోదయ విద్యాలయాల పాఠశాలల నుండి 26,398 మంది విద్యార్థులు మరియు 1,000 అఖిల పాఠశాలల నుండి 2,887 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి స్క్రీనింగ్ కోసం KVS, NVSమరియు CBSE నోడల్ అధికారుల ద్వారా ఎంట్రీలు స్వీకరించబడ్డాయి. ఉత్తమ ఎంట్రీలను రెండు దశల్లో ఎంపిక చేశారు, అంటే, ప్రాథమిక స్థాయి ఎంట్రీలను నోడల్ అధికారులు వారి స్వంత స్క్రీనింగ్ కమిటీలు ఎంపిక చేశారు మరియు రెండవ స్థాయి ఎంట్రీలను NCERT స్క్రీనింగ్ కమిటీ కింద మూల్యాంకనం చేసి, రికార్డ్ చేసి, ఖరారు చేసింది.

డ్రాయింగ్ మరియు పెయింటింగ్ విభాగాలలో విజేతలకు నగదు బహుమతులు మరియు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతి విభాగానికి మొదటి బహుమతి రూ. 15,000, రెండవ మరియు మూడవ బహుమతులు వరుసగా రూ. 10,000 మరియు రూ. 7,000. రెండు విభాగాలలో సర్టిఫికెట్లు మరియు గిఫ్ట్ హ్యాంపర్లు సహా పది కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేయబడ్డాయి.

# చిగురుమామిడిలో వేడుకల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు



చిగురుమామిడి, మార్చి 31: మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ పర్వదినాన్ని ముస్లిం సోదరులు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లోని ఈద్గాలలో ఈద్ నమాజ్ ను ఆచరించారు. మండలంలోని ఇందుర్తి, రేకొండ, ఉల్లంపల్లి, కొండాపూర్, చిగురుమామిడి, ముదిమాణిక్యం బొమ్మనపల్లి తదితర గ్రామాల్లో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండుగ జరుపుకున్నారు. గత 29 రోజులుగా పవిత్రమైన ఉపవాస దీక్షలు పాటించి నేడు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మజీద్ కమిటీలు, పలు పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ఉండ్రుగొండ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

నల్గొండ, మార్చి 31:సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండలో గల సీతారామచంద స్వామి ఆలయ కమిటీని సోమవారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామ పెద్దల సమావేశంలో ఆలయ చైర్మన్‌గా దాసరి నగేశ్, వైస్ చెర్మన్ ? చింతల ముత్తిరాజు, కార్యదర్శి ? గొడుగు వెంకన్న, కోశాధికారి ? పల్లేటి జనార్దన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ? దర్గబోయిన శంకర్, కార్యవర్గ సభ్యులుగా గుడిసె భిక్షం, గుండు యాదగిరి, దోనేటి పిచ్చయ్య, చిలుముల సైదులు, గుండెబోయిన ముత్తయ్య, గుడిసె యల్లయ్య, చింతల జానయ్యను ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మేడబోయిన నాగరాజు, దోనేటి కార్తీక్, దాసరి లింగయ్య, అంబటి సైదులు, మేడబోయిన రామయ్య, పల్లేటి వీరబ్రహ్మం, బిట్టు రాంబాబు, ఇటుకూరి తిరుమలి, గుడిసె లింగయ్య, తోడుసు ప్రశాంత్, కాంపాటి గోవర్ధన్, అడప రంజిత్, మామిడి యల్లయ్య, దాసరి రమేశ్, దాసరి సైదులు, గుడిసె సైదులు, యలగబోయిన ముత్తయ్య, గుడిసె రామకృష్ణ, పల్లేటి పెద్ద సైదులు, పల్లేటి చిన్న సైదులు, బైరు సైదులు, గుండు రామ్మూర్తి, దాసరి పవన్ పాల్గొన్నారు.

# టీసీఎస్ఎస్ ఆధ్వర్యంలో సింగపూర్‌లో వైభవంగా ఉగాది వేడుకలు

హైదరాబాద్, మార్చి 31: తెలంగాణ కల్చరల్ సొసైటీ సింగపూర్ (టిసిఎస్ఎస్) విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఫొటోన్స్ పాసిర్‌లోని శ్రీశివదుర్గ ఆలయంలో ఈ నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా సొసైటీ సభ్యులు ఆదివారం నాడు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పేరి కృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం బుట్టే వీరభద్ర దైవజ్ఞ (శ్రీ శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి) రాసిన గంటల పంచాంగాన్ని సొసైటీ సభ్యులకు అందజేశారు. ఈ వేడుకల్లో 300 మందికి పైగా తెలుగు వాళ్లు పాల్గొన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా తెలంగాణ కల్చరల్ సొసైటీ చేస్తున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని భక్తులు కొనియాడారు.

ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా ప్రాంతీయ కార్యదర్శులు సంతోశ్ వర్మ మాదారపు, భాస్కర్ నడికట్ల, శశిధర్ ఎర్రమ రెడ్డి, ఉపాధ్యక్షులు నల్ల భాస్కర్, దుర్గ ప్రసాద్, సంతోశ్ కుమార్ జూలూరి, ప్రశాంత్ బసిక, ఉపాధ్యక్షురాలు సునీత రెడ్డి మిర్యాల, ప్రధాన కార్యదర్శి బొందుగుల రాము, కార్యవర్గ సభ్యులు పెరుకు శివ రావ్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉగాది వేడుకలు విజయవంతం కావడానికి సహకరించిన దాతలకు, స్పాన్సర్లకు, సంబురాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టీసీఎస్ఎస్ అధ్యక్షులు గడప రమేశ్ బాబు, కోశాధికారి నంగునూరి వెంకట రమణ, సంస్థాగత కార్యదర్శి కాసర్ల శ్రీనివాస రావు, ప్రాంతీయ కార్యదర్శులు బొడ్ల రోజా రమణి, రవి కృష్ణ విజాపూర్, కార్యవర్గ సభ్యులు శివ ప్రసాద్ ఆవుల, రవి చైతన్య మైసా, భాస్కర్ రావు పులిగిళ్ల, విజయ మోహన్ వెంగళ, ప్రవీణ్ మామిడాల, సతీశ్ పెసరు, మణికంఠ రెడ్డి, రావుల సుగుణాకర్ రెడ్డి, చల్ల కృష్ణ తదితరులు భక్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఈ వేడుకలలో పాల్గొన్న వైఎస్ వీఎస్ఆర్ కృష్ణ (పాస్‌పోర్ట్ అటాచ్, ఇండియన్ హై కమిషన్, సింగపూర్) కు అధ్యక్షులు గడప రమేశ్ బాబు, కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ వేడుకలు ఘనంగా జరగడానికి చేయూతనందించిన మై హోమ్ బిల్డర్స్, సంపంగి రియాలిటీ ఇన్ఫ్రాస్ట్రక్చర్, యాఙ కన్స్ట్రక్షన్ కంపెనీ, గారాంటో అకాడమీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్, వజ్రా రియల్ ఎస్టేట్ కన్స్ట్రక్షన్ అండ్ డెవలప్మెంట్ కంపెనీ, ఏపీజే అభిరామి, ఏపీజే జువెల్లర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎవోల్వ్ మరియు సౌజన్య డెకార్స్‌కు సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నాడు మిషన్ భగీరథ ద్వారా పుష్కలంగా నీరు.. నేడు గ్రామాల్లో నల్లాల వద్ద మహిళల పడిగాపులు



మెదక్, మార్చి 31 : వేసవి కాలం ప్రారంభంలోనే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. చాలా వరకు గ్రామాల్లో సరిపడే నీరు అందక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సన్నటిదారలా రావడంతో గంటల తరబడి బిందెలు పట్టుకొని నల్లాల వద్దే ఉంటున్నారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వం గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ నీటిని సరాఫరా చేసింది. ఒక వేళ ఈ సరఫరాలో ఏదైనా అంతరాయం కలిగితే గ్రామ పంచాయితీ బోర్ల ద్వారా గ్రామాల్లోని ట్యాంకు, బస్తీల్లోని మినీట్యాంకులకు నీటిని అందింది నీటిని సమస్య లేకుండా చేసింది. కానీ నేడు అందుకు భిన్నంగా పరిస్థితులు మారాయి. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడం, వచ్చిన సన్నటి దారలాగా వచ్చి పట్టుమని పదిబిందెలు కూడా రాని దుస్థితి నెలకొందని గ్రామాల మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంలో పంచాయితీ ఆధ్వర్యంలో ఉన్న బోర్ల నుండి అయినా నీటిని అందించాలని కోరితే అవి రిపేరులో ఉన్నాయని కొందరు, కాలిపోయాయని మరికొందరు చెప్తుండగా.. కనీసం ట్యాంకర్లను పెట్టడానికి కూడా పంచాయితీల్లో డబ్బులు లేవని కొందరు అధికారులు చెప్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో అధికారులను కూడా తాము తప్పు పట్టడం లేదని పాలకులు ఉంటే వారినే అడిగే వాళ్లమని మహిళలు అంటున్నారు.

ఉదయం పూట పిల్లలు పాఠశాలలకు వెళ్లడానికి వంట చేద్దామంటే నీరు రాక వంట చేసుకోవడానికి చాలా సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి అప్పటి సమయానికి సర్దుకుపోవాల్సి వస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి రాలేదని.. ఆయన విలువ ఇప్పుడు తెలుస్తుందని కేసీఆర్ ఉంటే నీటి సమస్య పరిష్కార మార్గం తక్షణమే ఉండేదని నిర్భయంగా అంటున్నారు.

# వక్ఫ్ సవరణ బిల్లు ఆస్తుల రక్షణకు కాదు స్వాధీనానికి



నల్గొండ, మార్చి 31: వక్ఫ్ సవరణ 2024 బిల్లును వ్యతిరేకిస్తూ నల్లగొండ ఈద్గా ప్రార్ధన స్థలం దగ్గర నల్ల రిబ్బన్లు ధరించి సీపీఎం ఆధ్వర్యంలో ముస్లింలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లు మతపరమైన హక్కులకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ ఆస్తుల రక్షణకు విఘాతం కలిగిస్తుందని, వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లు-2024ను ఆగస్టు 8, 2024 రోజున పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టగా దీనిని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలన్నీ తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో బిల్లును జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపిందన్నారు. మొత్తం 31 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజల అభిప్రాయాలు సేకరించగా 5 కోట్ల మంది బిల్లులోని సవరణలు వ్యతిరేకిస్తూ జేపీసీకి వినతులు సమర్పించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

ఆస్తుల రక్షణకు కాదు, స్వాధీనానికి

కమిటీ 421 పేజీల నివేదికను 13 ఫిబ్రవరి 2025న లోక్‌సభ, రాజ్యసభలో ప్రవేశపెట్టింది. బిల్లుకు ప్రతిపాదించిన మొత్తం 44 సవరణల్లో 14 సవరణలు స్వల్ప మార్పులు చేస్తూ జాయింట్ పార్లమెంట్ కమిటీ ఆమోదించింది. ప్రతిపక్ష ఎంపీలు ఈ సవరణలు వ్యతిరేకిస్తూ ఇచ్చిన అసమ్మతులను రిపోర్ట్ నుంచి తొలగించారని, ప్రతిపక్ష ఎంపీలు ఉభయ సభల్లో గట్టిగా నిలదీయడంతో అసమ్మతులను తిరిగి చేర్చారు. ప్రస్తుతం జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లుకు ఓటింగ్ కి రాబోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు చేస్తున్నది ఆస్తులను రక్షించడం కోసం కాదని, ఆస్తులను ప్రభుత్వం పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలనే కుట్ర అని విమర్శించారు. ఒక బోర్డ్ పరిధిలో ఉన్న లక్షల ఎకరాలపై కార్పొరేట్లకు, శ్రామికవేత్తలకు కట్టబెట్టే కుట్రలో భాగమని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సభ్యులు ఊట్కూరి మధుసూదన్ రెడ్డి ఎగ్బాల్ సాజిద్, మైనారిటీ నాయకుడు, అడ్వకేట్ నజీరుద్దీన్, కనగల్ మాజీ ఎంపీపీ కరీం పాషా, మాజీ కౌన్సిలర్ ఇంతియాజ్, ఖలీల్, ఎగ్బాల్, అజీజ్, సోయబ్, అఖిల్, షకీల్ పాల్గొన్నారు.

# సీఎంగా మళ్లీ కేసీఆరే రావాలంటూ ఏప్రిల్ 4 నుంచి పాదయాత్ర : కర్రె వెంకటయ్య



నల్గొండ, మార్చి 31:రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన గాడితప్పి రైతులు, మహిళలు, యువతీయువకులు హరిగోస పడుతున్నారని, మళ్లీ కేసీఆర్ సర్కార్ వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య అన్నారు. "సీఎంగా కేసీఆరే రావాలి" అంటూ ఏప్రిల్ 4వ తేదీన పట్టణ యువజన నాయకులు ముక్కర్ల సతీశ్, ఆవుల సాయియాదవ్ ఆధ్వర్యంలో గుట్ట నుంచి ఎర్రవెల్లి కేసీఆర్ స్వగృహానికి సుమారు వెయ్యి మంది రైతులు, యువకులు పాదయాత్రగా వెళ్లనున్నట్లు తెలిపారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 4న స్వామి దర్శనం అనంతరం వైకుంఠ ద్వారం వద్ద పాదయాత్రను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు చెప్పారు. పాదయాత్రలో ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. కేసీఆర్‌ను కలిసి నియోజకవర్గంలోని కరువు, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వివరించనున్నట్లు చెప్పారు. రూ.2 వేల కోట్లతో యాదగిరిగుట్టను ప్రపంచమే గర్వపడే విధంగా కేసీఆర్ పునర్నిర్మించినట్లు తెలిపారు.

పునర్నిర్మాణంలో భాగంగా స్వామివారి దివ్య విమాన గోపురాన్ని 120 కేజీల బంగారంతో స్వర్ణమయం చేయాలని సంకల్పించారన్నారు. సీఎంగా కేసీఆర్‌తో పాటు ఇతర మంత్రులు, దాతలు అందజేసిన విరాళాలు సమారుగా వంద కిలోల బంగారం సమకూరిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఈఓ భాస్కర్‌రావు కలిసి కేవలం 10 కిలోల బంగారమే వచ్చిందని మిగతా 50 కిలోల బంగారాన్ని స్వామివారి ఖజానా నుంచి నిధులను సేకరించి కొనుగోలు చేసి 80 కిలోల బంగారంతో విమాన గోపురాన్ని బంగారు తాపడం చేశారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు విరాళాలకు సంబంధించిన వివరాలు చెప్పలేదన్నారు. ఈఓ భాస్కర్ రావు ఒక్కడే వెళ్లి బంగారాన్ని కొనుగోలు చేశారని చెప్పడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక యాదగిరిగుట్ట ఆలయం అధ్వానంగా మారిందన్నారు. భక్తులకు పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పీఆర్ వ్యవస్థను ఏర్పాటు చేసి భక్తులను దోచుకుంటున్నారని ఆరోపించారు. కొండపైన పెండింగ్‌లో ఉన్న 5 శాతం పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయన్నారు. బడ్జెట్‌లో దేవస్థానానికి ఒక్క రూపాయి కేటాయించకుండా స్వామివారి ఆదాయాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజలంతా మరోసారి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నట్లు, ఇదే అంశాన్ని కేసీఆర్ ను కలిసి రైతులు వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, బీఆర్ ఎస్ పట్టణ సెక్రటరి జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం అధ్యక్షుడు ముక్కర్ల సతీశ్‌యాదవ్, నాయకులు కోన్యాల నర్సింహారెడ్డి, గుండ్లపల్లి వెంకటేశ్ గౌడ్, దేవపూజ ఆశోక్, కారాజీ రాజేశ్ యాదవ్ పాల్గొన్నారు.

# ఢిల్లీ ధర్నాకు బయలుదేరిన బీసీ సంఘాలు

కాజీపేట, మార్చి 31: ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఏప్రిల్ 2న జరిగే ధర్నాకు కాజీపేట రైల్వే జంక్షన్ నుంచి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం బృందం ప్రతినిధులు, వివిధ బీసీ సంఘాల నేతలు రైలులో సోమవారం వేరువేరుగా బయలుదేరి వెళ్లారు.

ఈ సందర్భంగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చీఫ్ కోఆర్డినేటర్ వీరస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ వేర్వేరుగా మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాలలో 42% రిజర్వేషన్ ను కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల శాసనసభలో బిల్లును ఆమోదించిందన్నారు. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్ పెంపునకు సుప్రీంకోర్టు పరిధి నుండి మినహాయించి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్లో పెట్టాలన్నారు.

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు.

# జోహన్నెస్‌బర్గ్‌లో ఘనంగా ఉగాది వేడుకలు




సౌత్ ఆఫ్రికా, మార్చి 31: ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా (ఆశ) ఆధ్వర్యంలో జోహన్నెస్‌బర్గ్ నగరంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు భారత కాన్సులేట్ జనరల్ మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆఆశ బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ సంస్థ అధ్యక్షుడు రాజు జయప్రకాశ్ బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంతో పాటు ఆశ ఆధ్వరంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాల వివరాలు తెలియజేశారు.

అనేక విపత్తుల సమయంలో బాధితులకు ఆశ ఇచ్చిన భరోసానిచ్చి సభ్యులందరిలోనూ కొత్త ఉత్సాహం నింపేలా చేశారని ఆయన పేర్కొన్నారు. మిస్ వరల్డ్ 2024 గా ఎంపికైన దక్షిణాఫ్రికన్ అందాల తార జొలైజ్ జాన్సెన్ వాన్ రెన్స్‌బర్గ్ ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉగాది సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజయం సాధించినవారికి బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారుల ఆట, పాటలు యువత ప్రదర్శించిన నృత్యరూపకాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి.

